క్లుప్తంగా

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్ అందజేత



ఫర్నిచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఈఓ రాజ్‌కుమార్

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విజయవాడ రీజనల్ ఆఫీస్ హడ్కో ప్రాంతీయ కార్యాలయం ప్రధాన అధికారి బీఎస్ఏ మూర్తి సుమారు రూ.లక్షా 50 వేల విలువైన ఫర్నిచర్‌ను అందించినట్లు డిప్యూటీ డీఈఓ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వాటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 50 కుర్చీలు, టేబుల్స్, ట్యూబ్ లైట్లు తదితర సామగ్రిని హడ్కో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అందించినట్లు చెబుతూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు దత్తి అప్పల నాయుడు, సత్యనారాయణ మాస్టారు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన



ఆర్డీఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

పార్వతీపురం టౌన్: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వై.మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వీఆర్ఏలతో కలిసి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలియజేశారు. అనంతరం ఆర్డీఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో వీఆర్ఏలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని, గత ఎనిమిది సంవత్సరాలుగా ఒక్క రూపాయి వేతనం కూడా పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏల అర్హతలను బట్టి పదోన్నతి ఇచ్చి వీఆర్ఓలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మను దర్శించుకున్న అధికారులు



రేణుక ఎల్లమ్మ వారికి పూజలు చేస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని పెదంకలాంలో జరుగుతున్న రేణుక ఎల్లమ్మ వారి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం మండల అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు నాని శర్మ ఆధ్వర్యంలో ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు, ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ప్రసాద్, రామినాయుడు, ఇతరశాఖల అధికారులను సాదరంగా ఆహ్వానించి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు బలగ కుటుంబసభ్యురాలు ఎంపీపీ బి రవణమ్మ అధ్వర్యంలో కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ ప్రసాదాలు వితరణ చేశారు.

దళారులకు విక్రయించాక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు?

పార్వతీపురం: గిరిజన రైతులు పండించిన జీడి పిక్కలను దళారులకు విక్రయించిన తరువాత కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారా? అని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు అధికారులు, పాలకులను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ ఐకేపీ ద్వారా జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలను పార్వతీపురం, కురుపాం ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరి ప్రారంభించారని, వాటితో రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలగలేదన్నారు. జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలను పంటకాలం చివరిదశలో ప్రారంభించడమే అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పంట చేతికి వచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే దళారుల బెడద ఉండదని, పంట చివరి దశలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల అప్పటికే రైతులు దళారులకు తక్కువ ధరకు జీడి పిక్కలను విక్రయించి తీవ్రంగా నష్టపోయారన్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బీవీ రమణ, జీవీ రమణ, నాయకులు బి. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

పాచిపెంట: మండల కేంద్రంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ కొండలరావు బుధవారం పరిశీలించారు. స్వర్ణ పంచాయతీలో ఇళ్ల వివరాల ప్యూరిఫికేషన్, తడి పొడి చెత్త సేకరణ తదితర అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అందరూ నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మర్.. ఫ్రూట్స్ సురక్షితం



- వేసవిలో పండ్లతోనే ఆరోగ్యం
- డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



కొబ్బరి బొండాలు



నిమ్మకాయలు



పుచ్చకాయలు

బలిజిపేట:

భానుడి భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 10గంటల తరువాత బయటకు వచ్చేందుకు భీతిల్లుతున్నారు. ఈ ఎండల ప్రభావంతో ప్రజలు నోటి రుచులకు తాళాలు వేయాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఎండల్లో మసాలా, స్పైసీ ఫుడ్ తినకపోవడమే మేలని స్పష్టం చేస్తున్నారు. వేసవిలో నీటిశాతం అధికంగా ఉండే సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు. మజ్జిగ, నిమ్మరసం వంటి మేలుచేసే ద్రవపదార్థాలు తీసుకోవాలని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హితవు పలుకుతున్నారు. ఏప్రిల్ నెలలో భానుడి ప్రతాపం కన్నా మే నెలలో తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎండ ప్రభావం కనిపిస్తుంది. రాత్రి సమయంలో ఉక్కపోత, వడగాలుల దాడి అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు అల్లాడుతుంటారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు నీటి శాతం అధికంగా ఉన్న పండ్లను సేవించడం ఎంతోమంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

• ఉష్ణాన్ని తగ్గించే మజ్జిగ



వేసవి ఉష్ణాన్ని తగ్గించడంలో మజ్జిగ బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుంది. మజ్జిగను పటిక బెల్లంతో తీసుకుంటే పైత్యం తగ్గుతుంది. శొంఠి, పిప్పళ్లు, మిరియాల చూర్ణంతో కలిపి తీసుకుంటే కఫం తగ్గుతుంది. రోజూ మజ్జిగ ఎన్ని పర్యాయాలు తీసుకుంటే అంత మంచిది.

• కొబ్బరినీటితో ఉపశమనం

వేసవిలో శరీరంలో ఉష్ణోగ్రతలను త్వరగా తగ్గించేది కొబ్బరినీరు. అలసట, నీరసం, అధిక ఉష్ణోగ్రతలను త్వరగా తగ్గిస్తుంది. అవసరమైన పోషకాలతో పాటు తక్షణ శక్తిని అందించి దివ్య ఔషధంగా పనిచేస్తుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణం ఉంది. కొబ్బరినీటిలో క్యాలరీలు 46శాతం, పొటాషియం 600గ్రాములు, సోడియం 2.52మిల్లీ గ్రాములు, విటమిన్ సి 5.8 మిల్లీగ్రాములు ఉంటాయి.

• పోషకాల గని పుచ్చకాయ:

పుచ్చకాయలో బి విటమిన్, పీచుపదార్థం, పోటాషియం పుష్కలంగా ఉంటాయి. వాటితో శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా లభిస్తాయి. వడదెబ్బ నుంచి తక్షణ ఉపశమనం కలిగించే గుణాలు పుచ్చకాయలో ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. నీరు 95.2శాతం, ప్రొటీన్ 0.3గ్రాములు, కొవ్వు 0.2గ్రాములు, క్యాల్షియం 32మిల్లీగ్రాములు, ఐరన్ 1.3గ్రాములు, శక్తి 17 క్యాలరీలు ఉంటాయి.

నిమ్మ వినియోగం మంచిది

వేసవిలో నిమ్మకాయలు శరీర ఉష్ణాన్ని తగ్గించడంలో కీలకంగా పనిచేస్తాయి. నిమ్మరసాన్ని ఉప్పు, సోడాతో తీసుకోవడంతో దాహాన్ని నియంత్రించవచ్చు. శరీరానికి కావలసిన సి విటమిన్ నిమ్మరసంలో లభిస్తుంది. తేనె కలుపుకుని సేవిస్తే శరీర బరువు తగ్గించుకోవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. 10గ్రాముల నిమ్మలో శక్తి 29 క్యాలరీలు ఉంటాయి. పిండిపదార్థాలు 9.2గ్రాములు, కొవ్వు 0.3గ్రాములు, విటమిన్ సీ 53మిల్లీ గ్రాములు, కాల్షియం 326మిల్లీగ్రాములు ఉంటాయి.

• ద్రాక్షతో మేలు

సులువుగా జీర్ణమయ్యే పండ్లలో ద్రాక్ష ప్రధానంగా చెప్పవచ్చు. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు. కిడ్నీలో రాళ్లను నిరోధిస్తుంది. అజీర్ణం, మలబద్ధకం, గొంతు ఇన్‌ఫెక్షన్‌ను తగ్గిస్తుంది. శరీరంలో కొవ్వు పెరగకుండా నియంత్రిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడుతుంది. శక్తివంతమైన యాంటీ యాక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. నీరు 92శాతం, కార్బొహైడ్రేట్స్ 7శాతం, క్యాల్షియం 20మిల్లిగ్రాములు, సి విటమిన్ 30మిల్లీగ్రాములు ఉంటాయి.

సీజనల్ ఫ్రూట్స్ మంచివి

వేసవిలో సీజనల్ ఫ్రూట్స్ ఎంతో ఉపయోగకరం. పండును జ్యూస్‌కంటే పండును పండులాగే వినియోగిస్తే ఎంతోమేలు. విటమిన్లు, ఫైబర్లు ఉండే పళ్లు చాలామంచివి. లెమన్ వాటర్ మంచిది. కొబ్బరి నీరు, పుచ్చకాయలు ఎంతో శ్రేయస్కరం. పండ్లను జ్యూస్ రూపంలోనూ తీసుకోవచ్చు.

బి.క్రాంతికిరణ్మయి,
వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

సీహెచ్ఓల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న సీహెచ్ఓలు

పార్వతీపురంటౌన్: సీహెచ్ఓల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీహెచ్ఓలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈపీఎఫ్ఓను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు తక్షణమే చెల్లించి క్రమ బద్ధీకరించాలని కోరారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్ఓలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా పితృత్వ సేవలు మొదలైనవి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓలు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర జయంతి



మహాత్మా శ్రీ బసవేశ్వరుని విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జేసీ శోభిక

పార్వతీపురం టౌన్: సమాజంలో కుల వ్యవస్థను, వర్ణ భేదాలను, లింగ వివక్షను వ్యతిరేకించిన అభ్యుదయ వాది మహాత్మా శ్రీ బసవేశ్వర అని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక పేర్కొన్నారు. ఆయన బోధించిన తత్వాలు దేశమంతా విస్తరించాయని, ప్రేమతత్వం, సమానత్వం, బసవతత్వం ప్రబోధించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మహాత్మ శ్రీ బసవేశ్వరుని జయంతి వేడుకలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన బుధవారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె బసవేశ్వర చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మచంద్రా రెడ్డి, కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలుగా అందని రేషన్



తహసీల్దార్‌కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, గిరిజనులు

సాలూరు: తమకు రెండు నెలలుగా రేషన్ సరుకులను సేల్స్‌మేన్ ఇవ్వడం లేదని మండలంలోని దళాయివలస జీసీసీ డిపో పరిధిలో గల గిరిజనులు వాపోయారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ, దళాయివలస జీసీసీ డిపోలో సుమారు 250 రేషన్‌కార్డులున్నాయని, వారికి గడిచిన రెండు నెలలుగా డిపో సేల్స్‌మేన్ రేషన్‌సరుకులు పంపిణీచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరుకులు ఇవ్వాలని అడగ్గా సేల్స్‌మేన్ గిరిజనులకు నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని అంటున్నారని అది సరైన పద్ధతి కాదన్నా రు. అధికారులు దీనిపై తక్షణమే దర్యాప్తు చేపట్టి, రేషన్ లబ్ధిదారులకు రేషన్‌సరుకులు పంపిణీ చేయడంతో పాటు, సేల్స్‌మేన్‌పై సమగ్రదర్యాప్తు నిర్వహించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు, గిరిజనులు ఈశ్వరరావు, వెంకట్రావు, అజయ్, జగ్గారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

- మంత్రి అనుచరులే కాంట్రాక్టర్లు
- ప్రశ్నించలేని అధికారులు



చిన్న వర్షానికే బీటలు వారిన చిన్నివలస లింకు రోడ్డు

సాలూరు రూరల్/సాలూరు: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు దాదాపు మంత్రి అనుచరులే కాంట్రాక్టర్లు కావడంతో ఆయా శాఖల అధికారులు కాంట్రాక్టర్లు చేస్తున్న పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నప్పటికీ ప్రశ్నించలేని పరిస్థితిలో ఉన్నారు. దీనికి ఉదాహరణగా ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే బీటలు వారిన కూర్మరాజుపేట పంచాయతీ చిన్నివలస బీటీ రోడ్డు పనులను చెప్పవచ్చు. మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ చిన్నవలస నుంచి పునికినవలస లింకురోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల అంచనా వ్యయంతో గత ఏడాది అక్టోబర్ 28న స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి శంకుస్థాపన చేశారు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్డుకు ఇరువైపులా మట్టి కోరుకుపోయి బీటలు వారుతోంది. నిర్మాణ సమయంలోనే రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌ల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నివలస రోడ్డు జంక్షన్ ప్రారంభంలో రోడ్డుకు ఇరువైపులా పొలంలో మట్టిని తోసి బెర్మ్‌లుగా వేశారు. ఇరువైపులా పంటపొలాలు పెద్దగోతులుగా మారాయి. చెరువు గట్టుకు ఇరువైపులా పూర్తిగా బెర్మ్‌లు లేకుండానే రోడ్డు నిర్మాణం చేశారు. ఇంకా బీటీ వేయాల్సి ఉంది. ఈ విధంగానే బెర్మ్‌లు వేయకుండా బీటీ వేసినట్లు అయితే వచ్చే వర్షాకాలంలోనే పూర్తిగా రోడ్డు గోతులమయమవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పనుల్లో నాణ్యత పాటించాలని పలువురు కోరుతున్నారు.

కిశోరీ బాలికల సమగ్రాభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న సీడీపీఓ ఎస్.సులేఖ

సీతానగరం: మహిళా శిశుసంక్షేమ శాఖ బలిజిపేట ప్రాజెక్టు పరిధిలోఉన్న గ్రామాల్లో కిశోరీ బాలికల సమగ్రాభివృద్ధికి అంగన్వాడీ అధికార సిబ్బంది అవగాహన కల్పించుకోవాలని సీడీపీఓ ఎస్.సులేఖ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదభోగిలి డంపింగ్ యార్డుప్రాంగణంలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆదేశాల మేరకు మండల స్థాయిలో కిశోరీ వికాసం వర్క్‌షాప్‌ను (అవగాహన సదస్సు) నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల దృష్ట్యా దశలవారీగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరీ బాలికలకు వేసవి సెలవుల్లో నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలపై వివరిస్తూ బాల్య వివాహాలు రుతుక్రమం, పరిశుభ్రత, బాలల హక్కులు, పోషణ, ఆరోగ్యం, లింగ సమానత్వం, విద్యఅవశ్యకత, నైపుణ్యా భివృద్ధి ఉపాధి అవకాశాలు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పి.శ్రీధర్, లీగల్ ఆఫీసర్ హరికృష్ణ, శిశుగృహ సోషల్ వర్కర్ ఎ.రమ్య చిల్డ్రన్ హోమ్ ఇన్‌చార్జ్ జి.అన్నపూర్ణ, వైద్యసిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

• పొద్దు తిరిగే వేళ..!



సూర్యాస్తమయం సమయాన భానుడు కాంతులీనాడు. వాతావరణంలో సంభవించిన మార్పుల కారణంగా ఒక్కసారిగా చల్లబడిన వాతావరణంలో పసుపు, కాషాయం రంగులతో ఆకాశంలో అస్తమిస్తున్న సూరీడు పకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాడు. ఈ దృశ్యం బుధవారం సాయంత్రం పార్వతీపురం రాష్ట్రీయ రహదారిపై సాక్షి కెమెరాకు చిక్కింది. – పార్వతీపురం రూరల్

పిల్లందరికీ బర్త్‌సర్టిఫికెట్స్ పంపిణీకి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు బర్త్‌సర్టిఫికెట్స్, ఆదార్ సర్టిఫికెట్స్ పంపిణీ చేసేందుకు వివిధ శాఖల అధికార సిబ్బంది సిద్ధం కావాలని ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన పిల్లలకు ఆధార్, బర్త్ సర్టిఫికెట్స్ పంపిణీ చేయడానికి వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళాపోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందితో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నిర్దేశించిన అధికార సిబ్బంది సమన్వయంతో పనిచేసి చిన్నారుల తల్లిదండ్రులకు సహకరించాలని కోరారు. దరఖాస్తులు లబ్ధిదారుల నుంచి వేగవంతం చేయాలని సూచించారు. అధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకుని నిర్దేశించిన గడువులోగా సర్టిఫికెట్స్ అందజేయాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

సాలూరు: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కన్వీనర్, ప్రిన్సిపాల్ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో మే నెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే నెల 26న వెరిఫికేషన్, జూన్ 2 నుంచి 10వ తేదిల మధ్య ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లై చేసిన తరువాత వచ్చిన ఎకనాలెడ్జ్‌మెంట్ కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9052508903,8886789002 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంగన్వాడీ నియామకాలపై దర్యాప్తు చేపట్టండి



జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఇటీవల నిర్వహించిన అంగన్వాడీ నియామకాలపై దర్యాప్తు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వి.దాలి నాయుడు కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బాలగుడబ గ్రామానికి చెందిన చింతల ఉషారాణి అనే బాధితురాలు హెల్పర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా, రోస్టర్ పాయింట్లు, విద్యార్హత ప్రకారం ఆమెకు అర్హత ఉన్నప్పటికీ వేరే వ్యక్తికి ఉద్యోగం కేటాయించి అన్యాయం చేశారన్నారు. అంగన్వాడీ పోస్టుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.సాయి శ్రీనివాస్, జి.రామకృష్ణ, కోలా కిరణ్ కుమార్, తీళ్ల గౌరీశంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



వెంకంపేట గ్రామం మధ్యలో ఉన్న మలుపు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలో చేరిన వర్షపునీరు

రహదారిపై గుంతలు

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు ప్రధాన గ్రామాలకు వెళ్లేందుకు ఆధారమైన రహదారి శిథిలావస్థకు చేరి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రహదారిపై రాళ్లు తేలి ఎక్కడకక్కడే గుంతలు ఏర్పడడంతో వర్షం పడితే ఆ నీరు గుంతల్లో చేరి రహదారిపై ఎక్కడ ఏ గుంత ఎంత మేరకు ఉందో వాహనదారు అంచనా వేయలేని దుస్థితి నెలకొంది. దీంతో హఠాత్తుగా వాహనాలు గుంతల్లో దిగి వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారినపడే దుస్థితి నెలకొంది. ప్రజాసంఘాలు, వామపక్ష నాయకులతో పాటు స్థానికులు ఎన్నోమార్లు రోడ్డు దుస్థితిపై విన్నవించుకుంటే పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన కరువైంది. కనీసం గుంతల్లో గుప్పెడు మట్టిపోసే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఇప్పటికై నా అధికారులు స్పందించి సురక్షితమైన రహదారిని తమకు అందించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

సేవలు చిరస్మరణీయం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వెంకటగౌరీశంకర రావుకు జ్ఞాపికను అందిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీస్ శాఖలో 40 సంవత్సరాల సుదీర్ఘ కాలం ఉత్తమ సేవలు అందించి ఎన్నో సమస్యలను ఎదురొడ్డి, కష్టనష్టాలు ఓర్చుకుని ఆనందంగా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో అదృష్టమని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇర్లంకి వెంకటగౌరీశంకర రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఎస్పీ తన కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన కూడా వారు పోలీస్ కుటుంబంలో సభ్యులేనని ఎప్పుడు ఎలాంటి సమస్యలు వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. వెంకటగౌరీశంకర రావు సేవలను ఈ సందర్భంగా ఎస్పీ ప్రశంసించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గురుకుల పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి మూడవ తరగతిలో ప్రవేశానికి, 4 నుంచి 9వ తరగతి వరకు ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్. కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీడబ్ల్యూఆర్ఎస్(పీవీటీజీ బాలికల) మూడవ తరగతిలో 80మంది, 4వ తరగతిలో ఐదు ప్రవేశాలకు ఖాళీలున్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు మే 25లోగా ప్రిన్సిపాల్, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) భద్రగిరిలో అందజేయాలని, మరిన్ని వివరాలకు కన్వీనర్ ఫోన్ 9347278536 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.